క్లుప్తంగా

నేడు బలపనూరులో జగనన్న సురక్ష కార్యక్రమం

సింహాద్రిపురం : మండల పరిధిలోని బలపనూరు గ్రామ సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

రైతుల ఆనందమే ప్రభుత్వ ధ్యేయం

పులివెందుల రూరల్ : రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ అన్నారు. ఆదివారం స్థానిక దూదేకుల సంఘ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి రైతుకు అవసరమైన సహాయం అందిస్తున్నారు. 2022 ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన ప్రతి రైతుకు పంటల బీమా మంజూరు చేశారన్నారు. మంజూరైన ఈ మొత్తాన్ని ఈనెల 8వ తేదీన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. ఈ సమావేశంలో బండి రమణారెడ్డి, శేఖరరెడ్డి, వెంకట్రామిరెడ్డి, లింగాల శ్రీనివాసరెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీను, విశ్వనాథరెడ్డిలు పాల్గొన్నారు.

సీనియర్ హాకీ క్రీడాకారుడికి నివాళి

కడప స్పోర్ట్స్ : కడప నగరానికి చెందిన సీనియర్ హాకీ క్రీడాకారుడు కృపవరానికి కడప హాకీ క్రీడాకారులు నివాళులర్పించారు. ఆదివారం కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో కృపవరం జ్ఞాపకార్థం హాకీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హాకీ సీనియర్ క్రీడాకారులు సుభాన్‌బాషా, రమేష్, చూడామణివర్మ, సుధాకర్, రాంబాబు, విలియమ్స్ తదితరులు మాట్లాడుతూ జిల్లాకు చెందిన గొప్ప హాకీ క్రీడాకారుడి మరణం బాధాకరమన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు భాస్కర్, సందీప్, కీర్తి, ప్రవీణ్, బాషా, అనిల్, సునీల్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వస్తువులను పంపిణీ చేయాలి

రాజుపాళెం : హాస్టల్‌లో చదివే విద్యార్థులకు ప్రతి ఏడాది అందించే ట్రంకు పెట్టెలు, బెడ్ సీట్లు, ప్లేట్లు, గ్లాసులు తక్షణమే పంపిణీ చేయాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. రాజుపాళెంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు కాట్స్ ఏర్పాటు చేసి సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌ను మరింత మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మెస్ చార్జీలు ఒక్కొక్క విద్యార్థికి రూ. 3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాస్మొటిక్ చార్జీలు పెండింగ్ లేకుండా ప్రతి నెలా విడుదల చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. హాస్టల్స్‌ను నాడు–నేడులో చేర్చి అభివృద్ధిని చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.


కంపు కొడుతున్న సగిలేరు



సగిలేరులో వ్యర్థాలతో కలుషితమైన నీరు

కలసపాడు : స్థానిక గిద్దలూరు రోడ్డులోని సగిలేరు బ్రిడ్జి వద్ద సగిలేరులోని నీరు కలుషితమై కంపు కొడుతుంది. చికెన్ సెంటర్ యజమానులు తమ షాపులోని వ్యర్థాలను సగిలేరులో పడేయడంతో వ్యర్థాలతో నీరు కలుషితమై కంపుకొడుతుంది. ఒకప్పుడు బర్రెలు, మేకలు, గొర్రెలకు అక్కడ నీటిని తాపేవారు. ఇప్పుడు వ్యర్థాలు వేయడంతో జీవాలకు నీటిని ఇంటి వద్దనే తాపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే సగిలేరు వద్ద ఉన్న చుట్టుపక్కల ఇళ్ల యజమానులు కంపును భరించలేక పోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సగిలేరులో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా గ్రామోత్సవం



ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని దొరసానిపల్లె ఉన్న సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలో భాగంగా ఆదివారం సాయినాథుని గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సాయినాథునికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేకంగా రూపొందించిన రథంపై బాబా ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి పురవీధుల్లో సాయినామ కీర్తనలు, డప్పు వాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు.

గ్రామ స్వరాజ్యానికి ప్రతీకలు సచివాలయాలు

- సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పథకాలు
- దేశానికే ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ



రాగిమానుపల్లె గ్రామ సచివాలయం

పులివెందుల మండలంలో సచివాలయాల సంఖ్య : 23
వైఎస్సార్ ఆసరా తీసుకున్న లబ్ధిదారుల సంఖ్య : 9,440
వైఎస్సార్ ఆసరా ద్వారా పొందిన లబ్ధి : రూ.27.70 కోట్లు
మండలంలో వివిధ రకాల పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య : 8,890
మండలంలో నెల వారీగా పింఛనర్లు పొందిన లబ్ధి : రూ.1.91 కోట్లు

పులివెందుల టౌన్ : సామాన్యుడికి మరింత చేరువైయేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టడంతో ఎంతోమంది నిరుపేద, మధ్య తరగతి, అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మెలుజరిగిందని పలువురు అభివర్ణిస్తున్నారు. ఎన్నో ప్రభుత్వాలు వచ్చినప్పటికి ప్రజలకు సేవలు దగ్గర చేయాలని సంకల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టంగా అర్థమవుతోంది. సచివాలయ వ్యవస్థ ద్వారా 560 సేవలకుపైగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి పరిష్కరించడంలో మన రాష్ట్రం ముందుంది. మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని దేశ వ్యాప్తంగా ఎన్నో రాష్ట్రాలు సచివాలయ వ్యవస్థను అమలు చేసేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి వలంటీర్ల వ్యవస్థ ద్వారా 50 నుంచి 70 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి వారిలో మమేకమై ప్రభుత్వ పథకాలను మరింత చేరువ చేస్తున్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా వారి గ్రామాల్లోనే సేవలు పొందేలా సచివాలయాలను తీర్చిదిద్దారు. ప్రజల వద్దకే పాలన అంటూ తన చెప్పిన మాటను ముఖ్యమంత్రి నిలుపుకోవడంతో ప్రజలకు సేవలు మరింత దగ్గరయ్యాయి. ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి గ్రామ, గ్రామాల్లో సచివాలయాలను నెలకొల్పి ప్రజలకు సేవలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీగా నిలిచింది.

ప్రభుత్వ పథకాలు చాలా బాగున్నాయి.. :



ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు చాలా బాగున్నాయి. అందులో సచివాలయ వ్యవస్థ చాలా అద్భుతం. ప్రజల వద్దకే సంక్షేమ పథకాలతోపాటు 560 రకాల సేవలను సచివాలయంలోకి తీసుకొచ్చి ప్రజలకు సేవలు అందించడం ఎంతో గొప్ప విషయం. ప్రతి పేదవాడు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వలంటీర్ల ద్వారా తమ ఇంట్లోనే ఉంటూ ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతున్నారు. ఇలాంటి వ్యవస్థ నేనెప్పుడు చూడలేదు. ఇది చాలా బాగుంది. – నరసింహారెడ్డి(మున్సిపల్ కమిషనర్), పులివెందుల

ఈ ప్రభుత్వంలో నాకు ఎంతో మేలు జరిగింది :



నాకు అమ్మఒడి పథకం, విద్యా దీవెన, వికలాంగుల పింఛన్, ఇళ్లు, ప్రతి నెలా రేషన్ లాంటి పథకాలు సకాలంలో అందుతున్నాయి. గత ప్రభుత్వంలో నాకు ఎలాంటి పథకాలు అందలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఎక్కడికి వెళ్లకుండా కార్యాలయం చుట్టూ తిరగకుండా వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు. – సుభాషిణి(చిన్నన్న రూముల వీధి), పులివెందుల

ఇంతకన్నా ఏమి కావాలి.. :



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నాకు సంక్షేమ పథకాలన్ని సకాలంలో అందుతున్నాయి. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా అనుకున్న సమయానికి ప్రభుత్వ పథకాలన్ని అందుతున్నాయి. ఇంతకన్నా ఏమి కావాలి. నాకు అమ్మఒడి, వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న ఇళ్లు, జగనన్న తోడు లాంటి పథకాలతోపాటు మరిన్ని పథకాలు అందుతున్నాయి. దీంతో నేను ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి జగనన్న ప్రభుత్వం ఎంతో తోడ్పాటునిచ్చింది. – షేక్ నూర్జహాన్(నగరిగుట్ట), పులివెందుల

వైద్యవృత్తిలో కొనసాగడం అదృష్టంగా భావించాలి

బద్వేలు అర్బన్ : ప్రపంచంలో ఏ వృత్తికి దక్కని గౌరవం ఒక్క వైద్యవృత్తికి మాత్రమే దక్కిందని, అలాంటి పవిత్రమైన వైద్యవృత్తిలో కొనసాగడం ప్రతి వైద్యుడు అదృష్టంగా భావించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) బద్వేలు శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఎన్‌జీవో హోంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రపంచాన్ని వణికించిన కరోనా సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కరోనా రోగులకు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి డాక్టర్ ఫణీధర్‌లు మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటిసారిగా 2008లో దివంగత మహానేత వైద్యుల రక్షణ చట్టం తీసుకువచ్చారని గుర్తుచేశారు. అనంతరం బద్వేలుశాఖ ఐఎంఏ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా డాక్టర్ మీనాక్షిరెడ్డి, సెక్రటరీగా డాక్టర్ వాసుదేవరెడ్డి, ట్రెజరర్‌గా డాక్టర్ దినేష్‌లు ఎన్నికయ్యారు. అనంతరం సీనియర్ వైద్యులు డాక్టర్ మీనాక్షిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షులు శ్రీహరిరావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ వి.గోపాలకృష్ణ, ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ రవీంద్రనాథ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి, సీనియర్ వైద్యులు డాక్టర్ రాంప్రతాప్‌రెడ్డి, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 40 కుటుంబాలు చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ముద్దనూరు : మండలంలోని పెద్దదుద్యాల గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 40 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన శివచంద్రారెడ్డి, వరకుమార్‌రెడ్డి, సుధాకర్, నీలకంఠారెడ్డి, భూపాల్, రామచంద్రారెడ్డి, మధు, శ్రీను, రమేష్, అమర్, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్, చంద్రశేఖర్ తదిరులు పార్టీలో చేరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, శివారెడ్డి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం



వికలాంగులకు వస్త్రాలు, సరుకులు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ నాయకులు

కమలాపురం : స్థానిక ఆర్యవైశ్య సంఘం వారి వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం అని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకటరమణయ్య తెలిపారు. ఆదివారం వాసవీ క్లబ్ డాన్ టు డస్క్‌ను పురస్కరించుకుని పట్టణంలోని 30 మంది వికలాంగులకు క్లబ్ నిర్వాహకులు వస్త్రదానంతో పాటు సరుకులు పంపిణీ చేశారు. అలాగే దేశ భద్రతను కాపాడిన విశ్రాంత సైనికుడు ఈశ్వరయ్యను సన్మానించారు. పేద రైతుకు యూరియా అందజేశారు. ఖాజీపేట మార్గంలో సుస్వాగతం–కమలాపురం బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు బచ్చు సుబ్రమణ్యం, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి గాజులపల్లె శేఖర్, సంఘం నాయకులు మల్లికార్జున, రెడ్డి సురేష్, శంకర్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న మోదీ



కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న నాయకుడు పీఎం నరేంద్రమోదీ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు తీసుకుని 9 ఏళ్లు పూరైన సందర్భంగా వేంపల్లె పియాతోటలో బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజనతో కరోనా కష్టకాలలలో ఉచిత కరోనా వ్యాక్సిన్, ఉచిత బియ్యం అందించడం జరిగిందన్నారు. 13 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా, 9 ఏళ్లు ప్రధానిగా నరేంద్రమోదీ దేశానికి అలుపెరగని దేశ సేవ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి సాగుపై రైతుల ఆసక్తి



సింహాద్రిపురంలో సాగులో ఉన్న బొప్పాయి పంట

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా రైతులు బొప్పాయి పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చసిన ఆర్‌బీకేల ద్వారా ఎప్పటికప్పుడు రైతులు కొత్త రకాల పంటలను సాగుచేయాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. బొప్పాయి సాగుకు తక్కువ ఖర్చులతోపాటు దిగుబడి అధికంగా ఉండటంతో రైతులు బొప్పాయి పంట సాగుపై మక్కువ చూపుతున్నారు. బెంగుళూరు నుంచి ఒక్కో బొప్పాయి మొక్క రూ.16ల చొప్పున కొనుగోలు చేసి పంటను సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.80వేల ఖర్చు అవుతోందని.. పంటకు తెగుళ్లు, వైరస్ లేకుండా చూసుకుంటే ఎకరాకు 40 టన్నుల నుంచి 50 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం బొప్పాయి కాయలు టన్ను రూ.7వేల ధర పలుకుతోందని.. దిగుబడులు బాగావస్తే మంచి ఆదాయం పొందవచ్చునని రైతులు తెలుపుతున్నారు.

కామన్ సీనియారిటీతోనే భర్తీ చేయాలి



ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఎంఈఓ–1 పోస్టుల పేరుతో భర్తీ చేస్తున్న పోస్టులను ఏకీకృత సీనియారిటి అయిన ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) చైర్మన్ మాదన విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈఓ–1 పోస్టులను కామన్ సీనియారిటి ప్రకారం ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సి ఉండగా అందుకు భిన్నంగా కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులకు కట్టబెట్టేలా ఉత్తర్వులు జారీ చేయడం తగదన్నారు. జీవో 154 ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1154 ఆర్ట్స్, క్రాఫ్టు, మ్యూజిక్ పోస్టులను రద్దు చేసి వాటి స్థానంలో ఎంఈఓ–1గా 13 పోస్టులను, ఎంఈఓ–2గా 679 పోస్టులను క్రియేట్ చేశారన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎంఈఓ పోస్టులను ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులతోనే భర్తీ చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం పునరాలోచించి ప్రభుత్వ, జిల్లా పరిషత్తు యాజమాన్య ఉపాధ్యాయులను కలిసి సీనియారిటీ లిస్టు తయారు చేసి పదోన్నతులను ఇవ్వాలన్నారు.

6 నుంచి సదరం స్లాట్ బుకింగ్ చేసుకోండి

ప్రొద్దుటూరు : దివ్యాంగులు వైకల్య ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు ఈనెల 6 నుంచి సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చునని ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిసా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుసేన్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో బుకింగ్ చేసుకోవడానికి స్లాట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దివ్యాంగులు తమ సీమపంలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయంలో లేదా మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దివ్యాంగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సదరం సర్టిఫికెట్లను పొందాలని కోరారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

మైదుకూరు : సోహిత్ మృతికి కారణమైన బీరం విద్యాసంస్థల యజమాని బీరం శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్ డిమాండ్ చేశారు. మైదుకూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థి అనుమానాస్పదంగా మృతికి కారణమైన విద్యాసంస్థల యజమానిని అరెస్టు చేయాలన్నారు. విద్యాసంస్థల గుర్తింపును శాశ్వతంగా రద్దు చేయాలని, విద్యార్థి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను వారి తల్లిదండ్రులకు ఇష్టమైన పాఠశాల, కాలేజీలో చేరే విధంగా జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు అజయ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించిన సీఐ

ప్రొద్దుటూరు క్రైం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ప్రొద్దుటూరు టూ టౌన్ సీఐ ఇబ్రహీం ఆస్పత్రికి తరలించారు. మైదుకూరుకు చెందిన మహమ్మద్ ఆదివారం బైక్‌లో ప్రొద్దుటూరుకు వచ్చాడు. ఈ క్రమంలో శివాలయం సెంటర్‌లో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొనడంతో అతను తీవ్రంగా గాయ పడ్డాడు. కాలు విరగడంతో నడవలేక రోడ్డుపై పడిపోయాడు. విషయం తెలుసుకున్న సీఐ ఇబ్రహీం సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. సిబ్బందిని ఆస్పత్రికి పంపించి అతనికి మెరుగైన వైద్యం అందించేలా చొరవ తీసుకున్నారు.

ధరలను నియంత్రించాలి

కడప అగ్రికల్చర్: కొండెక్కిన టమాట, మిరప కూరగాయల ధరలనే వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం కడప రైతుబజార్‌లో ప్రభుత్వ సబ్సిడీ టమాట పంపిణీ కేంద్రంలో కూరగాయల ధరలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్బగా ఆయన మాట్లాడుతూ టమాట, మిరప ధరలు వంద రూపాయలకు పెరిగాయన్నారు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెరుగుతున్న ధరలను నియంత్రించాల్సిన పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆదివారం నుంచి రైతుబజార్‌లో సబ్సిడీతో అందిస్తున్న టమాటాలకు సంబంధించిన కౌంటర్లను పెంచాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీ, దర్గా వీధులలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పర్యటించి మాట్లాడారు. పట్టణంలోని సీసీ రోడ్లు, యూజీడీ పైపులైన్ అవసరమైన చోట గుర్తించి వెంటనే నివేదికలు తయారు చేసి పనులు చేపట్టాలన్నారు. అనంతరం మటన్ మార్కెట్‌ను తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లు వాడరాదని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు




కమలాపురంలో భిక్షాటన చేస్తున్న సాయిబాబా భక్తులు

కమలాపురం : పట్టణ పరిధిలోని కుప్పూరువారిపల్లెలో వెలసిన సాయిబాబా ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం కమలాపురం పట్టణంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తూ భిక్షాటన చేశారు. సోమవారం ఉదయం 6 గంటలకు కాగడ హారతి, 7 గంటలకు తీర్థ ప్రసాదాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 5 గంటలకు సాయిబాబా గుడి నుంచి కమలాపురం పట్టణం వరకు భారీ ఊరేగింపు నిర్వహిస్తామని, భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.


వీరపునాయునిపల్లె : మండలంలోని పోచంరెడ్డిపల్లె, పాయసంపల్లె, గంగిరెడ్డిపల్లె, పాలగిరి క్రాస్ వద్ద వెలసిన సాయిబాబా ఆలయాలలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాహకులు తెలిపారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జమ్మలమడుగు : పట్టణంలోని ముద్దనూరు రహదారిలో ఉన్న జ్ఞాన సాయిబాబా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ఆలకరించారు. సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, తాతిరెడ్డి తులసిలు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గండికోటలో పర్యాటకుల సందడి



గండికోటలో సందిచేస్తున్న పర్యాటకులు



కొండ చివరలో కూర్చున పర్యాటకులు

జమ్మలమడుగు : గండికోట ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. గండికోట ద్విచక్రవాహనాలు, కార్లతో నిండిపోయింది. ప్రస్తుతం పెన్నానదిలో గండికోట జలాశయం నుంచి నీరు విడుదల చేస్తుండటంతో పెన్నాలోయ నీటితో కళకళలాడుతోంది. ఈ దృశ్యాని చూడటం కోసం సాహసాలు చేస్తూ కొండల అంచులకు వెళ్లి సెల్ఫీలను తీసుకుంటున్నారు.

సైన్స్ అవార్డులు, పాఠాల తొలగింపు అసంబద్ధం



మాట్లాడుతున్న రాజశేఖర్ రాహుల్

కడప కల్చరల్ : 72 సైన్స్ అవార్డుల రద్దు...సైన్స్, చరిత్ర పాఠాల తొలగింపు అసంబద్ధమని జన విజ్ఞాన వేదిక(జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ రాహుల్ తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఈ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ఈ నిర్ణయాలు తీసుకుందని, వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బాల బయన్న మాట్లాడుతూ తమ రంగాల్లో కృషి చేసిన వారిని ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత అని, కానీ దాన్ని కూడా లాగేసుకుని శాస్త్రీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని కీలుబొమ్మలా మార్చేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నం దారుణమన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతూ దేశం ప్రగతి పథాన నడుస్తోందని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. పాఠ్యాంశాలలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం, పీరియాడిక్ టేబుల్ లాంటి అంశాలను తొలగించడం సరికాదన్నారు. ఒకవైపు అశాస్త్రీయమైన వాస్తు, జ్యోతిష్యం పాఠాలు పెట్టి ఇలాంటి శాస్త్రీయ అంశాలను తొలగించడం తిరోగమన చర్య అని విమర్శించారు. మేధావులు, శాస్త్రవేత్తలు, శాస్త్ర ప్రచార సంస్థలు వీటిని ఖండించాలని విన్నవించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సరస్వతి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గాజుల అలంకారంలో పెద్దమ్మ తల్లి



ప్రొద్దుటూరు : గోపవరం పంచాయతీలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో ఆషాడ మాసం రెండో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా గాజులతో అలంకరించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.